# ఆదర్శం

అదొక విశాలమైన హాలు. అందులోని పెద్దమనుషులందరూ సంస్కృతి, సాంప్రదాయాలను కలబోసుకున్న స్టెయిల్లో నిశ్చితార్థానికి సంభాషణలు జరుపుతున్నారు.

జగన్నాథంగారు, వారి సతీమణి జగదాంబగారు సుఖాసీనులై ఉంటే వారి కెదురుగా బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు ఆడపిల్ల తండ్రి అరవిందరావుగారు వారి ధర్మపత్ని అనూరాధతో.

ఆడపిల్ల తండ్రిగా అరవిందరావుగారు చెప్పారు.

"మా అమ్మాయి పంకజాక్షి మీ అబ్బాయి కమలాకరంగార్కి తగిన జోడి అని నా ఉద్దేశ్యం. వాళ్ళిద్దరూ ప్రక్కప్రక్కన నుంచుంటే ఆ జంటను చూడడానికి రెండు కళ్ళు చాలవు."

"అవునవును! మా అమ్మాయి మీ ఇంటి కోడలైతే మాకంతకంటే యింకేం కావాలన్నయ్యగారు" వంత పాడింది ఆ తల్లి.

"మావాడు కూడా పర్వాలేదన్నాడు" ముక్తసరిగా చెప్పారు జగన్నాథంగారు.

"మా అబ్బాయికే ఇష్టమని ఎంతో అందమైన రంభలాంటి అమ్మాయిలని వెంటేసుకుని చాలా మంది తిరుగుతున్నారు. కానీ, మాకు సాంప్రదాయం ముఖ్యం. ఏదో మీరైతే చాలాకాలంగా తెల్సినవారని అభిమానం – అమ్మాయి మాలో కల్సిపోతుందని మా నమ్మకం. వినయంగా ఉంటుంది." – అన్నారు జగదాంబగారు.

"ఇంకేం – మరి దగ్గరలోనే మాంచి ముహూర్తాలున్నాయి. మీ సెలవైతే పురోహితుడిని పిలిపిస్తాను. ఏమంటారు? అరవిందరావుగారు ఆనందంగా అన్నారు.

"ముహూర్తాలదేముందండి – ఎప్పుడూ ఉంటాయి – ఎటొచ్చి డబ్బులే... కొంచెం సర్దుబాటు చేసుకోవాలి కదండి – " జగన్నాథం చెప్పారు.

"డబ్బుదేముందండి – మనలో మనకి మొహమాటం ఎందుకు – కట్నం ఎంతకావాలో సెలవిస్తే తూగగలమేమో చూసుకుంటాం."

ఆ మాటవిని జగన్నాధం శివమెత్తి పోయారు. "అమ్మమ్మ ఎంతమాటన్నారు. కట్నమా! ఛీ! ఛీ! మా ఇంటా వంట లేదు."

"ఛ! ఛ! అబ్బాయిని అమ్ముకుంటామటండీ!" జగదాంబగారు ఆవేశపడిపోయారు.

"అన్నయ్యగారూ! ఆయన తెలీక అన్నారు – ఏమీ అనుకోకండి! ఏదో మా తృప్తి కొద్దీ అమ్మాయి పేర డిపాజిట్ చేసిన యాభైవేలు ఇస్తాం.... ఏం మంటారు వదినగారు?" పరిస్థితి చేయిజారిపోకుండా అడ్డుపడ్డారు అనూరాధమ్మగారు.

"ఏదో మీరు బలవంతం చేస్తున్నారు కాబట్టి.... ఏదో కొంత తీసుకుంటాంలెండి.... పెళ్ళి ఖర్చుకోసం..." జగన్నాథంగారు ఉద్ధరిస్తున్నట్లు చెప్పారు.

చప్పున జగదాంబగారు తెలివిగా అందుకుంటూ "అదేంటో అన్నయ్యగారు మా వంశంలో యాభై అచ్చిరావడంలేదు. అందుకని మూడు పాతికలైతే బాగుంటుంది."

"ఆ! డెభై అయిదు వేలా!'' నోరు వెళ్ళబెట్టారు అరవిందరావుగారు. "దాందేముందిలెండి లక్షా పాతికవేలు ఇస్తామని అనకాపల్లివాళ్ళు వచ్చి కూర్చున్నారు. డబ్బుదేముంది? సాంప్రదాయం, పిల్ల గుణగణాలు సలక్షణంగా ఉన్నాయని కన్నెత్తికూడా చూడలేదు - జగ్గయ్యపేట వాళ్ళయితే ఏకంగా రెండు లక్షలిస్తామన్నారు - కానీ డబ్బుకి కక్కుర్తి పడుతామా! చెప్పండి?" జగదాంబగారు డిమాండ్ తెలియజేస్తూ మర్మగర్భంగా అన్నారు.

అనూరాధమ్మగారు రహస్యంగా అరవిందంగారి కాలు తొక్కింది ఒప్పుకోమన్నట్లుగా.

"సరే! వదినగారు చెప్పిన తర్వాత తప్పుతుందా! మరి ముహూర్తాలు-?'' అరవిందంగారిలో తొందర కనిపించింది.

"మరి! మాకు ఉన్నది ఒక్కతే ఆడపడుచు - ఆమెకు ఓ వెయ్యినూటపదహార్లు ఆడబిడ్డ లాంఛనంగా యిస్తే ఎంతో బాగుంటుంది." జగదాంబగారు మురిసిపోతూ అన్నారు.

"దాందేముంది తప్పకుండాను" అనూరాధగారు వెంటనే ఒప్పేసుకుంది.

"అమ్మాయి మహాలక్ష్మిలా ఉంది. మెళ్ళో ఓ పది సవర్ల బంగారం వేస్తే." జగన్నాథంగారు ప్రతిపాదించారు.

"బంగారం ధర మీకు తెలియంది కాదు గదా! చాలా జాస్తిగా ఉంది! ఆమెకు ఓ గాజుల జత - ఓ గొలుసూ ఉన్నాయి. అవి పెట్టుకుంటుంది లెండి" అరవిందరాగవుగారు వివరించారు.

"అయ్యో! పెళ్ళిలో పాత బంగారం పెట్టుకుంటారా అన్నయ్యగారూ! కొత్త నగలు చేయించడం మన హోదాకు తగ్గట్టుగా వుంటుంది. అయినా అమ్మాయి అచ్చట, ముచ్చట ఇప్పుడు కాకపోతే ఎప్పుడు తీరుస్తారు?"

"అదికాదు బావగారూ! బంగారం మాకేం ఇమ్మనలేదు కదా! మీ అమ్మాయికే చేయించమని అడుగుతున్నాం. ఏమైనా అమ్మాయి మనసు నొప్పించడం నా కిష్టంలేదు." అని ఖండితంగా చెప్పారు జగన్నాథంగారు.

నీళ్ళు నములుతూ తన వంక చూసే భర్తని పర్లేదు ఒప్పుకోమన్నట్లుగా చూసింది అనూరాధ.

"మీరెలాగూ అమ్మాయికి చేయిస్తారు గదండి మళ్ళీ మేమెందుకు చేయించడం?"

లౌక్యంగా అన్నారు అరవిందరావుగారు.

"అయ్యో! పెళ్ళిలో కాబోయే కోడలికి బంగారం పెట్టడం పెద్ద ఆచారం గదండి!"

"కానీ, ఆ ఆచారం లేదండి మాకు మా ఇంటికి వచ్చింతర్వాత మాకు ఇష్టమైనంత పెడతాం - జగదాంబగారు తమ ఆచార వ్యవహారాలను గూర్చి చెప్పారు.

"సరే! మీరు తర్వాత పెడతారో లేదో! మీరడిగినట్లు అమ్మాయికి చేయిస్తాం లెండి" అని అనూరాధగారు చెప్పారు.

"ప్రేమంటే అలా ఉండాలి. కన్న తీపి కదూ!" జగన్నాధంగారు అన్నారు.

"మరి మేం సెలవు పుచ్చుకోమా"- అరవిందరావుగారి అభ్యర్ధన!

"మరీ అంత తొందరెందుకండీ! మళ్ళీ మళ్ళీ మాట్లాడుకోవడానికి నాకు తీరుబాటు అవదుగదా! ఆఫీసులో చాలా వర్క్ ఉంది." జగన్నాధంగారు కూర్చోబెట్టారు చనువుగా.

"చూడండి అరవిందరావుగారూ! మీకు ఒక అబ్బాయి ఉన్నాడు. నేను చెప్పేది అర్ధం చేసుకోండి. అబ్బాయి పెళ్ళికి కూడా చేతినుంచి పెట్టుకోవాలంటే నలుగురిలో చాలా చిన్నతనంగా ఉంటుంది."

"మేమిచ్చే డెభై అయిదు వేలల్లో సర్దండి. నేనైతే బ్యాంక్‌లో డిపాజిట్ కూడా చేస్తాను." అని అడ్డుకున్నారు జగన్నాధంగారిని అరవిందరావుగారు.

"ఆ! నా మొహం! మిగులుతుందా! ఏమన్నానా? అసలు సరిపోతుందో లేదో? అబ్బాయికి యింజనీరింగ్ చదివించడానికి అయిన ఖర్చు వడ్డీ, అసలు కలిసి అబ్బో తెగ పెరిగిపోయింది. సరే - ఏదో సరిపెట్టుకుంటాం కానీ... పెళ్ళి ఖర్చు పెట్టాలంటే నాకు సెంటిమెంట్ అడ్డం వస్తుంది" అన్నారు జగన్నాధంగారు ఇంకా అర్ధంకాలేదా అన్న ఫీలింగ్స్‌తో.

"ఎలాగూ పెళ్ళి మేమే చేస్తాం... యింకేముంది!" అనూరాధగారు ఆయన పాయింట్ అర్ధంకాక అన్నారు.

"ఎంత మీరు చేసినా మా దగ్గర బంధువులూ వాళ్ళకి బట్టలు పెట్టాలికదండి! మాకు ఎంత లేదన్నా పాతికమంది ఉన్నారు. ఇంత మంచి సంబంధం చేసుకుంటూ ఏదో మామూలు చీరెలు పెట్టలేం గదండి. ఏ బెనారస్ - ఏ కంచి పట్టుచీరెలో కొనాల్సివస్తుంది - అబ్బాయికి రెండు సూట్లు ఓ అరడజన్ రేమెండ్ బట్టలు కొనక తప్పదు" జగదాంబగారు కష్టాల్ని వెళ్ళబోసుకున్నారు.

"ఆహా! లక్షణంగా కొనండి. మాకభ్యంతరం లేదు. నిజంగా మీది దొడ్డమనసు బావగారు" మెచ్చుకోలుగా చూశారు అరవిందరావుగారు.

"మీ డబ్బుల్తో మీరు కొంటే మాకేంటి అభ్యంతరం-?"

"అది కాదండి! మనం వారి తరపున కొనాలట."

"నో! నా వల్లకాదు."

"అలా అయితే ఈ సంబంధం మాకొద్దు."

కాసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది! మనసులో కొన్ని లెక్కలు వేసుకొని అనూరాధమ్మ దానికి ఒప్పుకుంది - భర్తను ఒప్పించింది.

"ఇకపోతే అలకపాన్పులో ఎలాగు చేతక్ మీరు కొనిస్తారు కదా!"

"నో! నేను చస్తే కొనివ్వను."

"అయ్యో! ఆ స్కూటరు మేమేమన్నా వాడతాంటండీ! ఎంచగ్గా చిలకా, గోరింకలలాగా సాయంత్రం కాగానే అబ్బాయి కోడలు పిల్ల బజాజ్ చేతక్ మీద సినిమాకుపోతే ఎంత ముద్దొస్తారు." కలలు కనేశారు జగన్నాథంగారు.

"ఏదో మీ అమ్మాయి సుఖం కోసమే గదండి-మీరు స్కూటరు కొనిచ్చేది. ఇంత పెద్ద ఆఫీసర్‌గారి కూతురు రిక్షాలో - కాళ్ళతో తిరుగుతుంటే పదిమంది ఏమనుకుంటారు?" వివరించారు జగదాంబగారు.

"మా అమ్మాయిని మామూలుగానే పెంచాం... దానికి నడక అంటేనే ఇష్టం. దానికి నడకలో ఫస్ట్‌ప్రైజ్ కూడా వచ్చింది." - అనూరాధమ్మగారు చెప్పారు.

"ఏదో చిన్నపిల్ల! తెలియక నడిచివుంటుంది. మా కోడలు మా హోదాకు తగ్గట్లు ఉండాలి." జగన్నాథంగారు అసహ్యంగా మొహం పెట్టారు.

"ఆ రిక్షాలో హాయినూ! నడుములు పట్టెస్తాయండి వదినగారూ! మనకాలంలో తప్పలేదు. మన పిల్లలకేం ఖర్మండి - దర్జాగా ఎంచక్కా స్కూటరు మీద, కార్లలోనూ తిరుగుతారు" జగదాంబగారు తప్పదన్నట్లుగా ముచ్చటగా చెప్పారు.

"పెళ్లయిన తర్వాత ఇద్దరూ వెండికంచములో తిని వెండిగ్లాసుల్లో పాలు తాగితే అదొక అందం. అబ్బె వాటికి పెద్ద ఖర్చేమీ గాదులెండి. షాపులో కావాలంటే ఖాతా యిప్పిస్తాను. తర్వాత నెమ్మదిగా తీరుద్దురుగానీ."

అరవిందంగారి ముఖారవిందం ముకుళించుకుపోయింది. అనూరాధమ్మగారి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది.

"పెళ్ళి ఎలాగూ మీ హోదాకు తగ్గట్లు చేస్తారు కదా! మేమేం మీకు ఇబ్బంది కలిగించం. మీరు రెండు స్వీట్లేసినా, నాలుగువేసినా - మేమేం అనం! మా అంత మంచి వాళ్ళు ఇంకెవ్వరూ ఉండరు?" జగన్నాథంగారు హామీ ఇచ్చారు.

"అన్నింటికీ ఒప్పుకుంటాను. నేను కోరే ఒకే ఒక్కదానికి ఒప్పుకోండి చాలు!" అరవిందరావుగారు సూక్ష్మంగా అన్నారు.

"తప్పకుండా! మనలో మనకి దాపరికాలు ఎందుకు?"

"మీరడిగినట్లు అన్నీ ఏర్పాట్లు చేస్తాను.. కానీ, అబ్బాయిని మా ఇంటికి పంపండి" చల్లగా చెప్పారు.

"ఆ! ఇల్లరికమా!"

"ఛీ! ఛీ! మా ఇంటా వంటలేదు."

"అబ్బే! దీనికి ఇల్లరికమని పేరెందుకు? అబ్బాయి ఎక్కడుంటేనేం! మా ఇంట్లో వుంటే మీ ఇంట్లో వున్నట్లు కాదా? కావాల్సింది వారి సుఖం. కాలు కదపకుండా చూసుకుంటాం" హామీ ఇచ్చారు అరవిందరావుగారు.

"చాలు చాల్లేవయ్యా! మహా గొప్ప సంబంధం. అబ్బాయిని మీ ఇంటికి పంపించాలా? ఇదెక్కడి ఆచారం. కోడలు మా ఇంటికి వచ్చి వుండాలిగానీ!" అని జగదాంబగారు చిందులు తొక్కారు.

"తల కొరివి పెట్టాల్సినవాణ్ణి అలా అడగడానికి నీకు నోరెలా వచ్చిందయ్యా?" జగన్నాథంగారు విరుచుకుపడ్డారు.

అంత ఘాటుగాను అరవిందరావుగారు అరిచారు.

"మీరు ఆదర్శ పురుషులా! మీకు కట్నకానుకల మీద మోజులేదా! మీరు చదివిన లిస్టు అంతా కలిపితే నలుగురు అల్లుళ్ళని కొనుక్కోవచ్చు కట్నంతో! చేసే వెధవ పనికి ఆదర్శమనే ముసుగు ఒకటి - ఛస్తే నేను మా అమ్మయిని మీ ఇంటి కోడల్ని చెయ్యను" అని అరవిందరావుగారు తమ సతీమణితో బైటపడ్డారు.

( కలువబాల మార్చి 16-31' 90 )